క్లుప్తంగా

రాయితీపై విత్తనాలు అందివ్వాలి

సీతానగరం: రాయితీపై విత్తనాలు అందివ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి మండలంలోని రైతులకు అవసరమైన విత్తనాలు దొరకడం లేదని, ఆర్‌జీఎల్, స్వర్ణమసూరి, సాంబమసూరి, 1121 రకం వరి విత్తనాలు మాత్రమే అరకొరగా లభిస్తున్నాయంటున్నారు. విత్తనాల కోసం వ్యవసాయాధికారులను ఆశ్రయిస్తే ఇండెంట్ పెట్టామని, ఐదు రోజుల్లో వస్తాయని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రైతులకు అవసరమైన, సరిపడ విత్తనాలు రాయితీపై ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



బూర్జలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని చినబోగిలి, బూర్జ, మరిపివలస గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ ఆదివారం చేపట్టారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున నీటి నిల్వలు, మురుగు ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్‌లు తెలిపారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

నేమ్‌బోర్డు ఏర్పాటు చేయండి

పార్వతీపురం రూరల్: మండలంలోని చినబొండపల్లి గ్రామస్తులు తమ ఊరి రెండు చివర్ల నేమ్‌బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఓ వైపు ఒడిశా ప్రాంతాల నుంచి.. మరోవైపు పార్వతీపురం నుంచి వచ్చే వారికి తమ ఊరి వద్ద నేమ్‌బోర్డు లేకపోవడంతో ఇది ఏ ఊరు అని అడిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, అలాగే తమ ఊరి గుర్తింపు కూడా లేదన్నారు.

ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్: సీతానగరం మండలం, భగ్గందొరవలస గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఇంటి పనుల విషయాల్లో అత్తాకోడళ్ల మధ్య తలెత్తిన విభేదంతో మనస్తాపం చెందిన కోడలు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తగ్గిన చెరకు సాగు



బుడ్డిపేటలో నాటేందుకు చెరకు మొక్క తరలిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలో చెరకు సాగు విస్తీర్ణం క్రమక్రమంగా తగ్గిపోతోంది. లచ్చయ్యపేటలోని ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవడం, రేగిడి మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలించడం వంటివి కష్టతరమైన నేపథ్యంలో రైతులు చెరకు సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. ఫలితంగా మండలంలో ఏటేటా చెరకు సాగు తగ్గుతూ వస్తోంది. తక్షణమే ఇక్కడి లచ్చయ్యపేటలోని సుగర్ ఫ్యాక్టరీ తెరిపించి, రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు అందిస్తే చెరకు సాగు పుంజుకుంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం చిన్నచూపు

పార్వతీపురం రూరల్: జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తిన మోహనరావు విమర్శించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కొత్తగా ఆవిర్భావమైన జిల్లాలో అభివృద్ధి జాడలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది గడిచినా తన మార్క్ పాలన కనబరచలేదన్నారు. జిల్లాలో అడ్మినిస్ట్రేషన్ పక్కదారి పడుతోందని, కంచె చేను మేస్తే అన్న చందంగా అధికారుల తీరు ఉందన్నారు. ఉన్నతాధికారులు తమ ఇష్టారాజ్యంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారన్న ఆరోపణలు అందరి నుంచి వస్తున్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినా జిల్లాకు రెగ్యులర్ డీఈవో లేకపోవడం విచారకరమన్నారు. విద్యాశాఖలో గతంలో జరిగిన కేజీబీవీ నియామకాలపై అవినీతి ఆరోపణలున్నాయన్నారు. సీనియర్లను, అర్హులైన వారిని పక్కన బెట్టి ఒక ఎంఈవోను ఇన్‌చార్జ్ డీఈవోగా నియమించడం సరికాదన్న అభిప్రాయాలు అందరి నోట నుంచి వెలువడినా ఏ ఉన్నతాధికారి స్పందించలేదన్నారు. ఇకనైనా జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు ప్రభుత్వం కృషి చేసేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

భామినిలో భారీ వర్షం

భామిని: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రైతులకు ఊరటనిచ్చింది. పొలాలు, లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలలో నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు.



ధ్వంసమైన వెంకంపేట రోడ్డు



గుంతలమయమైన కొమరాడ అంతర్‌రాష్ట్ర రహదారి



జంఘావతి కాలువ వంతెన దగ్గరి రోడ్డు ఇలా..

అధ్వాన దారులు.. ఎన్నాళ్లీ అవస్థలు!

పార్వతీపురం మండలంలోని రహదారులు చాలా అధ్వానంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా అడుగుకో గుంత..గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తోంది. కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా..మరికొన్ని చోట్ల రోడ్లపై పైకితేలిన రాళ్లు దర్శనమిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల రోడ్ల మధ్యలోని గోతులు వర్షపునీటితో నిండిపోవడంతో ఏది సమతలమో.. ఏది గుంతో తెలియని దుస్థితి నెలకొంది. దీంతో పలువురి వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక పాదచారుల పరిస్థితి అయితే చెప్పాల్సినవసరం లేదు. కాళ్లు పుండ్లు అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు, ఆటోల్లో ప్రయాణించే వారైతే ఒళ్లు హూనమైపోతోందని వాపోతున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా తమ కష్టాలు పట్టవా? ఎన్నాళ్లీ అవస్థలు అని ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి రాగానే గుంతలు లేని రోడ్లు.. అద్దంలా మెరిసే దారులు వేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు ఏం చేస్తున్నారని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు బాగు చేయడంపై దృష్టిసారించాలని కోరుతున్నారు. -పార్వతీపురం రూరల్

జిల్లా కేంద్రంలో.. సమస్యల తిష్ట..!



ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డు



వర్షమొస్తే పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారి ఇలా..

- సమస్యలకు నిలయంగా పార్వతీపురం
- ప్రజలను వేధిస్తోన్న తాగునీటి సమస్య
- ప్రధాన రహదారిలో వీడని ట్రాఫిక్ సమస్య
- అధ్వానంగా రోడ్లు, కాలువలు
- అభివృద్ధికి నోచుకోని వార్డులు
- వర్షమొస్తే కాలనీలు జలమయం

పార్వతీపురం టౌన్:

జిల్లా కేంద్రంలో సమస్యలు తిష్టవేశాయి. ఎంతో కాలంగా ప్రజలను తాగునీటి సమస్య వెంటాడుతోంది. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అవస్థలు నిత్యం ఉంటూనే ఉన్నాయి. అధ్వాన రోడ్లు, కాలువలు, అభివృద్ధి జరగని ప్రాంతాలు, ఏ చిన్నపాటి వర్షం వచ్చినా జలమయమయ్యే కాలనీ, లోతట్టు ప్రాంతాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఓ పెద్ద చిట్టానే అవుతుంది. అయితే ఈ సమస్యలన్నింటినీ తామొస్తే తీర్చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు జిల్లా కేంద్రం వైపు అస్సలు చూడడం లేదు. అధికారంలోకి వచ్చారు కానీ అభివృద్ధి మాత్రం మరిచారని అందరూ విమర్శిస్తున్నారు. దీంతో గతేడాది కాలంగా ప్రగతి గమనంలో జిల్లా లేకుండా పోయింది.

గతంలో సుందరీకరణ..

వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2022 ఏప్రిల్ 4న పార్వతీపురాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. అప్పుడు జిల్లాకు ఏయే హంగులు ఉండాలో అన్నీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పట్టణ సుందరీకరణ చేపట్టారు. పార్కుల అభివృద్ధి చర్యలతో పాటు పలు వార్డుల్లో ప్రగతి పనులు పట్టాలెక్కించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి హయాంలో అభివృద్ధి కుంటుపడింది. ఎన్నికల సమయంలో జిల్లాకు ఇచ్చిన హామీలైనా కనీసం అమలు చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రోడ్లు.. చెరువులవుతున్నాయి..

ఏ చిన్నపాటి వర్షం కురిసినా జిల్లా కేంద్రంలోని పలు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారిలో భారీగా చేరే వర్షపునీటి కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరహాలగెడ్డ వరదనీటితో పొంగితే బైపాస్ కాలనీ జలమయమవుతుంది. ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఈ సమస్యను పరిష్కరిస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆయన హామీ అమలు దిశగా ఎటువంటి అడుగులు వేయడం లేదు.

జిల్లా ఆవిర్భావం నుంచి..

జిల్లా ఆవిర్భావం నాటి నుంచి జిల్లా కేంద్రాన్ని ప్రధానంగా వేధిస్తోంది.. ట్రాఫిక్ సమస్య. ఈ సమస్యను పరిష్కరించేందుకు పట్టణ శివారులోని వెంకంపేట నుంచి బైపాస్ నిర్మాణానికి గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. ప్రస్తుతం దీనిపై చంద్రబాబు సర్కారు ఎటువంటి నిర్ణయం చెప్పలేదు. పట్టణ ప్రధాన రహదారే జాతీయ రహదారి కావడంతో భారీ వాహనాలు సైతం పట్టణ ప్రధాన రహదారి మీదుగా వెళ్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో పాటు ప్రధాన రహదారిలోని షాపింగ్‌మాల్స్ వద్ద పార్కింగ్ లేకపోవడం కూడా ట్రాఫిక్ సమస్య ఏర్పడడానికి ఓ కారణంగా తెలుస్తోంది.

చెప్పుకోలేని దుస్థితిలో శివారు కాలనీలు..

పట్టణంలోని ఇందిరాకాలనీ, గూడ్‌షెడ్ రోడ్డు, వైకేఎం కాలనీ, లెప్రసీ కాలనీ, ఎస్ఎన్‌పీ కాలనీ, కొత్తవలసలో పలు కాలనీల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువల్లో పూడికతీతలు తీయక, సమయానికి తాగునీరు అందక అక్కడి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారులోని లెప్రసీ కాలనీవాసుల పరిస్థితి అయితే మరీ దారుణం. కాలనీలో గత పది రోజులుగా తాగునీరు సరఫరా లేదు. పారిశుధ్యం కూడా లోపించింది.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.63 కోట్లు..

పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కరించేందుకు గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సమగ్ర తాగునీటి పథకానికి రూ.63 కోట్లు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆ పనులు నిలిపివేశారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవడం లేదు. ఫలితంగా నాలుగు రోజులకొకసారి నీరు సరఫరా చేస్తున్నారు. దీనికితోడు కుళాయిల ద్వారా వచ్చే నీరు బురదగా ఉండడంతో తాగేందుకు నీరు లేకుండా పోతోందని పట్టణవాసులు వాపోతున్నారు. తాగునీటి సమస్య తీర్చాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తుప్పలు, డొంకలతో లెప్రసీ కాలనీ



ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి చేరిన వర్షపునీరు

పది రోజులుగా తాగునీరు లేదు..



మాది లెప్రసీ కాలనీ, మా కాలనీలో గత పది రోజులుగా తాగునీరు సరఫరా లేదు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. కనీసం వాటర్ ట్యాంకర్లతోనైనా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నాం. లెప్రసీ వ్యాధితో బాధపడుతున్న మాపై ప్రభుత్వం దయచూపాలి.

-చెవిటి పార్వతమ్మ, లెప్రసీ కాలనీవాసి, పార్వతీపురం

ఇళ్లల్లోకి విషసర్పాలు వచ్చేస్తున్నాయి..



కాలనీ పరిసర ప్రాంతాల్లో సరైన వసతులు లేవు. దశాబ్దాల క్రితం నిర్మించిన కాలనీలో ఉంటున్నాం. ఇదే కాలనీ పరిసర ప్రాంతాల్లో తుప్పలు, డొంకలు ఎక్కువయ్యాయి. అక్కడి నుంచి విషసర్పాలు ఇళ్లల్లో వచ్చేస్తున్నాయి. ఎప్పుడు ఎవరికి ఏం జరుగుతుందోనన్న భయం ఎప్పుడూ మాలో ఉంటుంది. కనీసం తుప్పలు అయినా తొలగించండి.

-బంగారు రాము, లెప్రసీ కాలనీవాసి, పార్వతీపురం

పట్టణాభివృద్ధిపై దృష్టి సారించాలి..



పార్వతీపురం పట్టణాభివృద్ధిపై అటు పాలకులు, ఇటు అధికారులు దృష్టిసారించాలి. వర్షం పడితే చాలు రోడ్లు నిండా వర్షపునీరే ఉంటోంది. సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోని నాయకులే పట్టించుకోవాలి.

-గెద్దం మెల్లయ్య, పార్వతీపురం

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి..

పట్టణంలోని పలు ప్రాంతాల్లోని రోడ్లు అడుగుకో గుంత.. గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ శివారులోని రాయగడ రోడ్డు, ఫ్లైఓవర్ బ్రిడ్జి రోడ్డు, కొత్తవలస శివారులోని రోడ్లు పొడవునా గుంతలే ఉన్నాయి. రోడ్లు బాగాలేని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం దురదృష్టకరం.



ప్రధాన రహదారిలో నెలకొన్న గుంతలు

సమస్యలు పరిష్కరించండి 'బాబూ'..

- మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ డిమాండ్

పార్వతీపురం టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబును మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏడు రోజులుగా నిరసన చేస్తున్నారు. తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. టెక్నికల్, నాన్‌టెక్నికల్ సిబ్బందికి వేతనాలు రూ.29,200, రూ.24500 ఇవ్వాలన్నారు. 55 ఆదివారాలు, జాతీయ, రాష్ట్ర పండుగ దినాలు(72 రోజులు) సెలవులుగా ప్రకటించాలన్నారు. లేకపోతే ఆయా రోజుల్లో పనిచేసినందుకు గాను వేతనాలు లెక్కగట్టి ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన సిబ్బందికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అలాగే మృతుల కుటుంబాల్లోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వినతించారు. సీనియార్టీ ప్రాతిపదికన జీతాల చెల్లింపులు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఇవేవీ పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

సమస్యల ఒడిలో సర్కారు బడి



ఈ చిత్రంలో చూస్తోంది..సాలూరు మండలం, తుండ ప్రాథమిక పాఠశాల. శిథిలావస్థకు చేరుకున్న భవనం, వర్షమొస్తే కారిపోయే తరగతి గదులు, ఎప్పుడు కూలిపోతుందో తెలియని భవనంలో మధ్యాహ్న భోజనం వంటలు ఇలా..సమస్యల ఒడిలో సర్కారు బడి మగ్గుతోంది. అంతేకాకుండా విద్యార్థులకు అవసరమైన కనీస వసతులేవీ లేవు. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి, పాఠశాల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -సాలూరు రూరల్

అభివృద్ధికి నోచుకోని బస్టాండ్



బలిజిపేట మండల కేంద్రంలోని బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీస సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి, ప్రయాణికులకు తగిన బస్సులు లేకపోవడంతో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి. అలాగే బస్టాండ్ ఆవరణ కూడా చిన్నది కావడంతో అక్కడే వచ్చీపోయే బస్సులు టర్న్ చేయడం, అంతలోనే సీట్లు కోసం ప్రయాణికులు పడే పాట్లు ప్రమాదాన్ని పొంచేవిగా ఉన్నాయి. విశాల ప్రదేశంలో బస్‌స్టేషన్ ఉంటే బాగుంటుందని మరికొంతమంది అభిప్రాయపడుతున్నారు. -బలిజిపేట

అల్లుకున్న నిర్లక్ష్యం

పార్వతీపురం మండలం, వెంకంపేట శివాలయం దగ్గరలోని విద్యుత్ స్తంభాన్ని చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఇట్టే అర్థమైపోతుంది. స్తంభం మొత్తం, కరెంట్ తీగలకు కొంత మేర తీగమొక్కలు అల్లేశాయి. దగ్గర నుంచి చూస్తే తప్ప దూరం నుంచి చూసేవారికి అదొక చెట్టులాగే కనిపిస్తోంది. స్థానికులకు అయితే ఫర్వాలేదు కానీ కొత్తవారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతివారం మరమ్మతు పనులంటారు కదా ఇంతవరకు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తీగమొక్కలు తొలగించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-పార్వతీపురం రూరల్



సంఘ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

- విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.హనుమంతురావు

పార్వతీపురంటౌన్:

అన్నివిధాలా వెనకబడి ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘ బలోపేతమే లక్ష్యంగా మనమంతా పనిచేద్దామని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి. హనుమంతురావు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని బైపాస్ రోడ్డులోని ఆ సంఘ భవనంలో సంఘ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లవుతున్నా ప్రభుత్వాలు మనల్ని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప తమ సంక్షేమం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా విశ్వబ్రాహ్మణులు ఉన్నప్పటికీ మనకు కనీస గౌరవం ఇచ్చే ప్రభుత్వాలు కరువయ్యాయన్నారు. రెండు నెలల్లో గా 26 జిల్లాల్లో విశ్వబ్రాహ్మణ జనగణనకు చర్యలు తీసుకోవాలని, మనందరికీ న్యాయం జరగాలంటే మనమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నా రు. కూటమి ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీ మేరకు విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మన్యం జిల్లా విశ్వబ్రహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఆ తర్వాత కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు

మంచి ఆప్తుడిని కోల్పోయా..

బలిజిపేట: మండలంలోని అంపావల్లి గ్రామ సర్పంచ్ వెంకటరత్నం భర్త, పలగర సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు శెట్టి కృష్ణమూర్తినాయుడు అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందా రు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అల జంగి జోగారావు ఆ గ్రామానికి వెళ్లి, కృష్ణమూర్తినా యుడి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించా రు. కృష్ణమూర్తినాయుడు మృతి తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని, ఓ మంచి ఆప్తుడిని కోల్పోయానని విచారం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తినాయుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు